పనులు సక్రమంగా జరిపించాలి



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య

గూడూరు: ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితోపాటు కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన ఈజీఎస్ పథకంలో జరిగే పనులను సక్రమంగా జరిపించాలని డీఆర్‌డీఓ సన్యాసయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఉదయశ్రీ మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీడీఓ రోజారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో 2019–2020, 2020–2021 కి సంబంధించి మండలంలో జరిగిన రూ.20కోట్ల పైచిలుకు ఉపాధి పనులపై నెల రోజులు జరిగిన సామాజిక తనిఖీలో వెల్లడైన వివరాలను తనిఖీ బృందం వివరించారు. ఈతనిఖీలో ఎక్కువగా పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు చేసిన తప్పుడు రికార్డుల వల్ల కూలీలకు కొన్ని చోట్ల నష్టం కాగా, కొన్ని చోట్ల జరగని పనులకు, జరిగినట్లు, కూలీలకు తక్కువ డబ్బులు వచ్చేలా జరిగిన రికార్డుల నమోదును వారు చూపారు. ముఖ్యంగా కొందరు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పనులలో నిర్లక్ష్యం చూపినట్లు తనిఖీ బృందాలు వెల్లడించారు. మొత్తానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ జరిగే పనులపై తప్పకుండా శ్రద్ధ చూపుతూ కర్తవ్యదీక్షతో పనులు చేపట్టాలని, తప్పనిసరిగా రికార్డులు చూపాలని, కూలీలకు న్యాయం జరిగేలా, అభివృద్ధి జరిగేలా పనిచేయాలని సన్యాసయ్య సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ ఎండి. ఖాసీం, సర్పంచ్ నూనావత్ రమేష్, అంబుడ్స్‌మెన్ ప్రతినిధి బి.ఆదాము, ఎస్సార్పీ సుధాకర్, చారీ, వెంకటరమణ, క్యూసీ సురేందర్, ఏపీఓ బన్సీలాల్, ఎంపీడీఓ గోవిందరావు, టీఏలు, డీఆర్పీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ధ్వంసం



ధ్వంసమైన సీసీ రోడ్డు

గార్ల: మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం చేసే సమయంలో సదరు కాంట్రాక్టర్ ఇటీవల గార్లలో రూ.1.5కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు ధ్వంసం అయ్యాయి. దెబ్బతిన్న సీసీ రోడ్లకు మరమ్మతులు చేయకుండానే కాంట్రాక్టర్ చేతులు దులుపుకొని వెళ్లిపోయాడు. దీంతో కొన్ని చోట్ల పైప్‌లైన్ వేసే చోట సీసీ రోడ్లు ధ్వంసం చేశారు. ఇదే కాకుండా రోడ్ల పక్కన తీసిన గొయ్యికి సంబంధించిన మట్టి రోడ్లపై పోయడంతో సీసీ రోడ్లు మట్టి రోడ్లలా తలపిస్తున్నాయి. పలుమార్లు గ్రామస్తులు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా దెబ్బతిన్న సీసీ రోడ్ల ప్రాంతాల్లో రోడ్డు నిర్మించాలని, రోడ్లపై మట్టిని తొలగించాలని గార్ల పట్టణ ప్రజలు డిమాండ్ చేశారు.ఇట్టి విషయంపై ఏఈ వసుంధరను 'సాక్షి' వివరణ కోరగా నిధులు విడుదల కాగానే దెబ్బతిన్న సీసీ రోడ్ల ప్రాంతాల్లో మరమ్మతులు చేయిస్తానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉపేందర్‌కు డాక్టరేట్



గార్ల: ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఏఆర్) ఢిల్లీలో మండలంలోని గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన కొంగ ఉపేందర్ పీహెచ్‌డీ పూర్తి చేసి, ఐసీఏఆర్ డీజీ చేతుల మీదుగా ఈనెల 25న పీహెచ్‌డీ(డాక్టరేట్) పట్టా పొందాడు. ఉపేందర్ ఇంజనీరింగ్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి కలుపు మొక్కలను గుర్తించి పంట మొక్కలకు నష్టం వాటిల్లకుండా కలుపు మందులను పిచికారి చేసే యంత్రాన్ని తయారు చేయడంతో డాక్టరేట్ పట్టా అందజేశారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర ఆరో తరగతికి, ఇంటర్ మొదటి సంవత్సరం 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల పరీక్ష జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రశాంతంగా జరిగాయని జిల్లా కోఆర్డినేటర్ ప్రత్యూష ఆదివారం తెలిపారు. మొత్తం 369 మంది విద్యార్థులకు 332 మంది విద్యార్థులు హాజరు కాగా 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



కురవి: సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేదలకు వరంలాంటిదని జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి అన్నారు. సీరోలు, కురవి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 14 మంది పేదలకు మంత్రి సత్యవతిరాథోడ్ సహకారంతో వచ్చిన సీఎంఆర్‌ఎఫ్ పథకం చెక్కులను ఆదివారం గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ జబ్బులతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు అయిన ఖర్చులో కొంత సీఎంఆర్‌ఎఫ్ నుంచి అందడం మేలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు జంగిలిహరిప్రసాద్, బోడశ్రీను, జీవన్‌నాయక్, ఉప సర్పంచ్ నరేష్, నరహరి, గుండెబోయిన సూరయ్య, దీరావత్ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం భూపోరాటం




నెహ్రూసెంటర్: ఇళ్లు లేని నిరుపేదల కోసం సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించి ఇంటి స్థలాలను అందజేసేందుకు పోరాటాలు చేపట్టామని సీపీఐ నేతలు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, నర్రశ్రావణ్, వెలుగు శ్రావణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతబజారులోని ప్రభుత్వ భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం చేపట్టి జెండాలను ఆదివారం పాతారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిరంజీవి, భద్రయ్య, హర్షవర్ధన్, మల్లికార్జున్, మల్లయ్య, సత్యనారాయణ, అశోక్, జలగం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుగువారం



కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో ఇటీవల బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు ఆదివారం తిరుగువారం పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు, జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట సంజీవరెడ్డి, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కురవి: మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో జరగబోయే తెలంగాణ గిరిజన సంఘం మూడో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను సంఘం నాయకులు ఆదివారం కురవి గుడి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవానాయక్, లింగానాయక్, లక్ష్మణ్‌నాయక్, నాగులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



పెద్దవంగర: సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

పెద్దవంగర/తొర్రూరు: ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఏమైందని, సీఎం కేసీఆర్ ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెదగాని సోమయ్య అన్నారు. మండలంలోని ప్రజాగోసా బీజేపీ భరోసా యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఎల్బీతండాలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ జాతోతు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశాన్ని ఆర్థికంగా ప్రతిష్టం చేస్తే, కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పాకనాటి దామోదర్ రెడ్డి, లేగ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, మండల అధ్యక్షుడు సుధాకర్, వడ్డెకొత్తపల్లి ఎంపీటీసీ సాయిని ఝాన్సీ రవి, తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పల్లెకుమార్, నాయకులు దామోదర్‌రెడ్డి, రాజేష్, రాజేష్, రవి, శ్రావణ్ పాల్గొన్నారు.

డోర్నకల్: తెలంగాణాలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని బీజేపీ నియోజకవర్గ ప్రభారి ఈవీ రమేష్ అన్నారు. మండలంలోని బూరుగుపాడు గ్రామంలో ఆదివారం జరిగిన ప్రజాగోస, బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఈవీ రమేష్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు బాసాని నాగేశ్వర్‌రావు, విమల్‌జైన్, కొత్త దాసు, అప్పారావు, పెంటయ్య, ఉపేందర్, గణేష్‌నాయక్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రిజ్ బహూకరణ

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి దాతలు ఫ్రిజ్ బహూకరించారు. ఆదివారం దాతలు మరిగంటి శ్రీనివాస చార్యులు కుటుంబ సభ్యులు, దేశబోయిన వీరమల్లులను సన్మానించినట్లు సర్పంచ్ నల్లాని నవీన్‌రావు తెలిపారు.

వైద్యశిబిరం

నెల్లికుదురు: ఉచిత వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్ కోరారు. ఆదివారం మండలంలోని శ్రీరామగిరి గ్రామంలోని ఉప కేంద్రంలో దార్ల సురేష్ జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నేతావత్ వెంకన్న, సురేందర్, సర్పంచ్ డొనికెన జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు ఆదూరి సుభాషిణి గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కేసముద్రం: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో హైదరాబాద్‌లో ఇనుగుర్తి మండల సాధన సమితి కన్వీనర్ చిన్నాల కట్టయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో ఆదివారం చేరినట్లు తెలిపారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: మార్చి 5వ తేదీన బయ్యారం మండలంలో జరగనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.మధార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పులిగిళ్ల బాలమల్లు, ఎకాంబ్రం, కట్ల నాగరాజు, సోమయ్య, బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

డోర్నకల్: గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడే, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నేత ఏఎల్ మల్లయ్య అకాల మృతి పట్ల పట్టణ గంగపుత్ర సంఘం నాయకులు దేవర వెంకటేశ్వర్లు, ఏరువ ఎల్లయ్య, గుంటి కొమరెల్లి, శంకర్, శివ, తదితరులు ఆదివారం సంతాపం తెలిపారు.

నేడు తాగునీటి నీటి సరఫరా బంద్

గార్ల: ఇల్లందు సమీపంలో మిషన్ భగీరథ పైప్ లీకేజీ కారణంగా నేడు గార్ల మండలంలో భగీరథ కులాయిల ద్వారా తాగునీరు రావని, ప్రజలు ఒక రోజు సహకరించాలని సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ ఆదివారం తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న వెంకన్న

గూడూరు: రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినీలు, చిన్నారులపై రోజురోజుకు అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, బాధ్యులపై కఠిన చర్య తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నం వెంకన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం కటకం బుచ్చిరాములు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్లే మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. వరంగల్ కేఎంసీలో పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్, నాయకులు వీరస్వామి, బిచ్చనాయక్, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: విద్యార్థిని ప్రీతిపై ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని టీజేఎస్ జిల్లా నాయకులు హరినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు శాంతికుమార్, పూల్‌సింగ్, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

బయ్యారం: ఇంజినీరింగ్ విద్యార్థి నవీన్ హత్యకు కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్య తీసుకోవాలని సేవాలాల్ సేన జిల్లా కార్యదర్శి తేజావత్ రవీందర్‌నాయక్ ఆదివారం డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చిరంజీవి, లక్ష్మణ్, నాగ, తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న వీరస్వామి

మరిపెడ రూరల్: ఎరుకల గిరిజన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి అన్నారు. మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామశివారులో ఆదివారం ఏర్పాటు చేసిన ఎరుకల ఆత్మీయ సమ్మేళన సమావేశానికి ముఖ్యఅతిథిగా వీరస్వామి హాజరయ్యారు. ఎరుకల గిరిజనులను ఓటు బ్యాంకుగా చూస్తున్నరే తప్ప వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోయారు. ఏప్రిల్ 10వ తేదీన జిల్లా కేంద్రంలో ఎరుకల భారీ మహారంగ సభను ఏర్పాటు చేసి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్ట రవీందర్, ప్రధాన కార్యదర్శిగా అంగడి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుంభం ఉపేందర్, ఉపాధ్యక్షులుగా శ్రీరామ్ సురేష్, అంగడి బాలకిష్ణ, కోశాధికారిగా శ్రీరాముల శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా గణేష్ ఏక్రగీవంగా ఎన్నుకున్నారు.

భట్రాజులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

తొర్రూరు: భట్రాజు కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని భట్రాజు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూర్ణచందర్‌రాజు కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో భట్రాజు సంఘం జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రతికంఠం దేవేందర్ రాజుతో పాటు గౌరవ అధ్యక్షుడిగా ఎస్.మనోహర్ రాజు, ప్రధాన కార్యదర్శిగా భాస్కరుని శ్రీనివాస రాజు, కోశాధికారిగా నారాయణరాజు, ఉపాధ్యక్షుడిగా సంజీవరాజు, కిరణ్‌రాజు, సహాయ కార్యదర్శిగా కృష్ణ మోహనరాజు, న్యాయ సలహాదారు ప్రవీణ్‌రాజు, కార్యవర్గ సభ్యులు కొండం రాజు, ఆమని, సాహితి, లక్ష్మీలు ప్రమాణ స్వీకారం చేశారు. పూర్ణచందర్‌రాజు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కోకాపేటలో 20 గుంటల భూమి భట్రాజులకు సీఎం కేసీఆర్ కేటాయించడం గర్వకారణమన్నారు. భట్రాజు సామాజికవర్గ సమస్యలపై పోరాడతానని తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన కేజీబీవీ విద్యార్థినులు

మహబూబాబాద్ అర్బన్/డోర్నకల్: వరంగల్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో జిల్లా కస్తూర్బా గాంధీ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో కేజీబీవీ డోర్నకల్ విద్యార్థులు రెండు బంగారు, మూడు సిల్వర్, 3 బ్రాంజ్ పతకాలు, తొర్రూర్ కేజీబీవీ విద్యార్థులు 15 గోల్డ్, 15 సిల్వర్, 4బ్రాంజ్ పతకాలు, గార్ల కేజీబీవీ విద్యార్థులు 5 గోల్డ్ మెడల్స్ సాధించారని అన్నారు. జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను డీఈఓ అభినందించారు.

ఘన నివాళి

గంగారం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క ఆదేశాల మేరకు మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వర్గీయ నల్లెల కుమారస్వామి ఆత్మకు శాంతిని చేకూర్చాలని గంగారంలో సంతాపసభ నిర్వహించారు. అనంతరం కుమారస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు, జెడ్పీటీసీ ఈసం రమసురేష్, సాంబయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



దంతాలపల్లి: సరుకులు పంపిణీ చేస్తున్న బాలవికాస సభ్యులు

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం బాలవికాస ఆధ్వర్యంలో 24 మంది అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ లతప్రతాప్ రెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడతూ.. బాలవికాస సాంఘిక సేవా సంస్థ వార్షికోత్సవంలో భాగంగా ప్రతి సంవత్సరం అనాథ పిల్లలకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైతుమండల సమితి కోఆర్డినేటర్ మల్లారెడ్డి, ఎస్సై జగదీష్, బాలవికాస సభ్యులు సుకన్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీకి చెందిన దివ్యాంగ మహిళ జినుక మనీషాకు హోప్‌స్టెప్స్ ఫౌండేషన్ సభ్యులు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. మహబూబాబాద్ పట్టణానికి చెందినన జిలుగు దర్గయ్య, కళావతి దంపతుల 30వ వార్షికోత్సవం సందర్భంగా అందజేసినట్లు ఫౌండేషన్ సభ్యులు భూనేష్, శ్రీకాంత్, నవీన్ తెలిపారు.

మరమ్మతులకు నోచుకోని కాల్వలు

- 3నెలల్లో ప్రారంభం కానున్న వానాకాలం
- చివరి భూములకు సక్రమంగా నీరందక ఏటా ఎండిపోతున్న వరిపంట
- రైతుల గోడు పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



సంగళ్ల కాల్వలో చెత్తాచెదారం



పిచ్చి మొక్కలతో బోదెపంపు కాల్వ

గార్ల: గార్ల పెద్ద చెరువు పంట కాల్వ మరమ్మతులకు నోచుకోక పోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట కాల్వలు సక్రమంగా లేకపోవడంతో ప్రతీ ఏటా ఆయకట్టు చివరి భూముల పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు. వచ్చే వానాకాలం నాటికి ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గార్ల పెద్దచెరువు ఆయకట్టు కింద ఖరీఫ్‌లో 2500 ఎకరాల్లో వరిపంట సాగవుతుంది. ఈ చెరువుకు నాలుగు తూములు ఉన్నాయి. చింతముత్తిగాని తూము, మైసు తూము, సున్నం తూము, సంగళ్ల తూములు ఉన్నాయి. ఈతూముల నుంచి పంటలకు నీళ్లు వెళ్లే పంట కాల్వలు చెత్తాచెదారం, పూడికతో నిండిపోయాయి. దీంతో ఆయకట్టు కింద భూములకు సక్రమంగా నీరందక రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. 9 ఏళ్ల క్రితం గార్ల చెరువు, పంట కాలువల మరమ్మతుల కోసం రూ. కోటి నిధులు మంజూరయ్యాయి. నాడు సదరు కాంట్రాక్టర్ తూతూమంత్రంగా పనులు నిర్వహించి వదిలేశారు. దీంతో ప్రతీయేటా రైతులే డబ్బులు జమ చేసుకొని నామమాత్రంగా కాల్వలు మరమ్మతులు చేపట్టుకొని పంటలు పండించుకున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి వచ్చే ఖరీఫ్ నాటికైనా పంట కాల్వలకు మరమ్మతులు చేపట్టి డ్రాప్‌లు నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

'సైన్స్'లో మేటి

- ఆదర్శంగా నిలుస్తున్న కంబాలపల్లి పాఠశాల



ప్రశంస పత్రం అందుకుంటున్న గురునాథరావు



సీసీఎంబీ సదస్సులో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) పేద ఆర్థిక నేపథ్యం ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విజ్ఞాన శాస్త్ర విద్యను అందించేందుకు వినూత్నమైన కార్యక్రమంలో పాల్గొంటూ, నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని ప్రత్యేక కథనం..

జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి న్యూఢిల్లీ వారు గత జులైలో విద్యా బోధనలో వినూత్న ఆవిష్కరణలు ప్రయోగాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాజెక్ట్ ఎంపికై జాతీయ స్థాయి అవార్డు గెలుచుకుంది. ఈ ప్రాజెక్టు సమన్వయకర్తగా పాఠశాల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ వి.గురునాథరావు వ్యవహరించారు. విద్యా బోధనలో వినూత్న ఆవిష్కరణ జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఒకే ఒక్క తెలంగాణ ప్రభుత్వ పాఠశాల కంబాలపల్లి ప్రాజెక్ట్ కావడం విశేషం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మొదటిసారి అగస్త్య ఫౌండేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ సహకారంతో పాఠశాలలో 2022 డిసెంబర్6 నుంచి 7వ రకు విద్యా వర్క్ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. గురునాథరావు మార్గదర్శనంలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఇ.సాయిలేఖ్య, డి.ప్రశాంత్ ప్రతిష్ఠాత్మక సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రామ్ (వైఐపీ) 2023కి ఎంపిక కోసం పోటీ పరీక్షలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెల్లికుదురు: స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం 1990–91 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 33 ఏళ్లకు ఒకే వేదికపై కలుసుకున్నారు. పూర్వ ఆత్మీయ సమ్మేళనంలో అప్పటి సంఘటనలను నెరువేసుకుని సరదగా గడిపారు. పూర్వపు గురువులు భద్రారెడ్డి, వీరభద్రాచారి, సుందరాచార్యులు, రామానుజాచార్యులు, వీరమల్లు యాదవ్, లక్ష్మయ్య, దక్షిణమూర్తిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.